# ఆడపిల్లని కదా....

శిల్ప



ఒక్కొక్కప్పుడు ఈ పెయింట్‌స్టోర్స్‌లో ఎందుకు చేరానా అని నేను బాధపడుతూంటాను. కానీ తప్పదు. ఇంటర్ దాటి ఆడపిల్లను చదివించడం వేస్టని నాన్న అభిప్రాయం. పెళ్లిచేయడానికి డబ్బులేదు. మంచి రోజులు వస్తే కళ్యాణం దానంతట అదే అవు తుందని అమ్మా, నాన్నా ఇద్దరి అభిప్రాయం., అలాఅని నేనుకూడా ఇంట్లో కూర్చుని మంచిరోజులకోసం ఎదురు చూస్తూంటే అమ్మకు బాధ.

"ఆ ఎదురింటివాళ్ల అమ్మాయి నర్సింగ్ హోమ్‌లో చీట్లురాసి నెలకు నాలుగొందలు సంపాదిస్తోందట. పరికిణీ, జాకెట్టు ఖర్చయినా కలిసివస్తుంది. అలా డబ్బు కాస్త వెనకేస్తే రేపు కట్నానికైనా మిగులుతుంది. ఇంట్లో ఊరికే కూర్చుని పుస్తకాలు చదువుతూ కూర్చుంటే ఎక్కడినుంచైనా రాజకుమారుడు ఊడిపడతాడా? ఉద్యోగం పేరు చెప్పి నలుగురి కంటా పడతారు. ఎవరికైనా పిల్ల నచ్చితే వాళ్లే వచ్చి అడిగి, చేసుకుంటారు. వంకజమ్మగారమ్మాయికి అలాగేగా సంబంధం కుదిరిందీ!" అని ఒకటేపోరు. ఆ బాధ భరించలేకనే ఈ ఉద్యోగంలో చేరింది.

ఇక్కడికొచ్చాక చూస్తే ఎవరికంటా పడేట్టు లేదు. అసలు కస్టమర్లు రావడమే తక్కువ. గంటకు ఇద్దరు, ముగ్గురు రావడం అబ్బురం. ఆ వచ్చేవాళ్లయినా పెయింట్ వేసే కుర్రాళ్లు, పనివాళ్లు. రంగు లంటించుకున్న చొక్కాలు చూస్తేనే వికారం పుడుతుంది. పోనీ కూడా పనిచేసేవాళ్లచి చూడబోతే, ఏభైయేళ్ల సుబ్బరత్నంగారి మొహం ఎప్పుడూ మొటమొటలాడుతూ ఉంటుంది. రిటైరయ్యాక భుక్తి గడవక చేరిన వెంకట్రామయ్యగారికి చెవుడు కూడా. ఓనరుగారు కుర్రాడే కానీ షాపుకే సరిగ్గా రాడు. తండ్రి పోరు పడలేక షాపు పెట్టాడు కానీ, ఇంట్రెస్టు లేనట్టుఉంది. నాలుగురోజులకోసారి ఫ్రెండ్స్‌తో వచ్చి పదినిముషాలు ఉండి వెళ్లిపోతాడు. చేరి నెల్లాళ్లయినా తనపేరు విజయ అని తెలుసో, లేదో?

"కొత్త అమ్మాయి ఎలా చేస్తోంది?" అని అడుగుతాడు. వెంకట్రామయ్యగారు "బుద్ధిమంతురాలే!" అంటారు. చుప్పనాతి సుబ్బరత్నంగారు "ఏదోలెండి ..." అంటుంది మూతివిరుచుకుంటూ. కంటికి నదురుగా కనబడినవాడు అతనొక్కడే.

ఆవేళ శనివారం. మధ్యాహ్నం ఒకతన
ఒకతను వచ్చాడు. చాలా బిడియస్తుడని చూడగానే
తెలిసిపోయింది. పెయింట్ శాంపుల్‌బిళ్లలన్నీ అటు
నుంచి ఇటూ, ఇటునుంచి అటూ తిరగేసి చూస్తు
న్నాడు.

సుబ్బరత్నంగారు "ఏం కావాలయ్యా?" అని
దార్ష్టికంగా అడిగేటప్పటికి తడబడ్డాడు. తనకి జాలి
వేసింది.

"నేను అటెండ్ అవుతున్నానండీ!" అన్నాను
సుబ్బరత్నంతో.

అతను కృతజ్ఞతగా చూశాడు. నోరు పెగల్చు
కుని, 'సోఫాకు ఏ రంగు బాగుంటుందంటారు?'
అని అడిగాడు.

నన్ను సలహా అడిగేవాడు ఇన్నాళ్లకి ఒకడు
దొరికాడు. ఉద్యోగంలో చేరేముందు రంగుల కం
పెనీవాళ్లు ఇచ్చిన రెండురోజుల ట్రైనింగ్ ఇప్పుడు
పనికి వచ్చింది. ఎటువంటి చెక్కకు, ఎటువంటి
ఇంటికి ఏ రంగు నప్పుతుందో నేను లెక్చరు
కొట్టాను. దెబ్బకు గుమ్మైపోయాడు. అత పొండుగు
మనిషి కుచించుకుపోయి నాకేసి అతి మర్యాదగా
చూశాడు.

'ఆ పెద్దఛాతీ విరుచుకుని నిలుచుంటే బాగుం
టుంది. నిటారుగా నిలబడి నాకళ్లలోకి చూసి
మాట్లాడితే బాగుంటుంది, ఆ గడ్డం పూర్తిగా పెంచి
నా బాగుంటుంది, లేదా నున్నగా షేవ్ చేసుకున్నా
బాగుంటుంది. అంతేకానీ అలా షేబీగా ఉంటే
బాలేదు. మరీ అంత భయం భయంగా ఉండడం
దేనికీ? మగాడిలా, మొనగాడిలా దబాయించి
అడగచ్చుగా?' అని అనిపించింది కానీ పైకి అన
లేదు. ఎలా అంటాం?

అతను నా సలహా ప్రకారం అన్నీ కొంటుంటే
నాకు భలే గర్వంగా అనిపించింది. అన్నీ మోసుకుని
వెళ్తూ గుమ్మంలో ఎవర్నో గుద్దేయబోయాడు.
'బుచ్చిబాబు' అని పిలవబుద్దేసింది. 'బుద్ధూ!'
అన్నా తప్పులేదనిపించింది. గంటన్నర పోయాక
మళ్లీ వచ్చినప్పుడు బ్రష్ ఇంట్లోలేదుట. అన్ని
పెయింట్లు కొన్నవాడికి బ్రష్ కొనాలని తెలీదూ!

"బ్రష్ గురించి అంతదూరంనుంచీ మళ్లీ
వచ్చారా, మీ ఇంటి దగ్గర్లో షాపేదీ లేదా?"
అన్నాను.

"రెండుమూడు ఉన్నాయండీ! కానీ ఏది మం
చిదో మీఅంత బాగా ఎక్స్‌ప్లెయిన్ చేసి ఎవరు చెప్తా
రండీ!" అన్నాడు మా బుచ్చిబాబు.

భలే సంతోషంగా అనిపించింది. సుబ్బరత్నం
గారు ఆ మాటవిని మొహం ముడుచుకున్న విధా
నం తలుచుకుని ఆ రాత్రి నవ్వుకుంటూంటే అమ్మ
చివాట్లేసింది కూడా - "ఏమిటే ఆ వెర్రినవ్వులు,
ఆడపిల్లకు అంతనవ్వు మహాచేటు సుమా!"
అంటూ.

ఆ తరువాత ప్రతి శనివారం అతను రావడం,
ఏదోఒకటి కొనడం. ఫారిన్ఎడిషన్ 'డూ ఇట్ యువ
ర్‌సెల్ఫ్' పుస్తకం ఒకటి కొనుక్కొచ్చాడు. దాంట్లో
పేర్లుచెప్పి అది వుందా అంటాడు.

"ఆ పేర్లు వేరండీ! లోకల్‌గా వేరే పేర్లతో పిలు
స్తారు. నేను చెబుతున్నానుగా పట్టుకెళ్లండి!" అని
నేను చెప్తేచాలు 'సరే, సరే' అని బుర్ర ఊపేసి
కొనేస్తాడు,.

"అంతా నా సలహామీదే కొనేస్తున్నారు. మీ
ఆవిడకి కోపం వచ్చేస్తుందేమో జాగ్రత్త!" అన్నా
ఓసారి.

"బ్రహ్మచారిని కదా, ఆ బాధలు లేవు!" అన్నా
డు నవ్వుతూ.

అతని నవ్వుచూడటం అదే మొదటిసారి. పెళ్లి
కాలేదని ముందే అనుకున్నాను. భార్య వుంటే ఇం
టికలరింగ్ విషయంలో వేలుపెట్టకుండా ఉంటుం
దా? ఏమో, పురిటికి పుట్టింటికి వెళ్లిందేమో, సంద
ర్భం చూసి ప్రస్తావిస్తే పోలా అనిపించింది. నేనాశిం
చినట్టుగానే పెళ్లకాలేదని చెప్పాడు.

"బ్రహ్మచారికి ఇంత ఝుంఝూటం ఎందు
కండీ బాబూ!" అన్నాను నవ్వుతూనే.

వాళ్ల ఫాక్టరీలో ఒకాయన దుబాయి వెళ్లిపోతూ
ఇతనికి తన పాత ఫర్నిచరూ, సామానూ అంటగట్టి
వెళ్లిపోయాట్ట. ఇతినిక వాటికన్నింటికీ పెయింట్లు
వేసి అందంగా చేద్దామని తాపత్రయంట. ఇతన్ని
కట్టుకోబోయేది చాలా అదృష్టవంతురాలే! అదే
ఆలోచనలో పడి అతనికి అయిదురూపాయల
చిల్లర ఎక్కువవచ్చేశాను. సుబ్బరత్నంగారు పట్టే
సింది. నేను కట్టుకోవాల్సివచ్చింది. మూడురోజులు
బస్సు మానేసి నడిచిరావలసివచ్చింది.


పై శనివారం వచ్చినప్పుడు అతనికా విషయం
చెప్పలేదు. చెబితే ఇచ్చేసేవాడే కానీ నాకే చెప్పబుద్ధి
కాలేదు. చెప్పలేకపోయాననవచ్చు. అతను బిల్లు
కట్టినప్పుడు ఏదో గుర్తుకొచ్చినట్టు చెబుదామను
కున్నాను కానీ, నోట్లు తీసుకునేటప్పుడు అతని
వేళ్లు తగిలాయి. ఏదో మైకం ఆవహించినట్ట
యింది. ఐదురూపాయల మాట తట్టలేదు. అత
నూ నన్ను చూసి కాస్త ధైర్యంగా, పలకరింపుగా
నవ్వుతున్నాడు. బెరుకుపోయినట్టుంది.

"అసలు ఇన్ని పెయింట్లు కొంటున్నారు కానీ
ఎలా వేస్తున్నారో ఏమో, మీ ఇంటికి వచ్చి సలహాలు
ఇమ్మంటారేమిట?" అని అన్నప్పుడు వంకర్లు
తిరిగిపోకుండా "అంతకంటేనా!" అన్నాడు.

చూస్తున్నాను-నాతో పరిచయమయ్యాక అత
నికి ఆత్మవిశ్వాసం పెరిగినట్టుంది. బట్టలమీద శ్రద్ధ
పెరిగినట్టుంది. గడ్డంకూడా రోజూగీస్తున్నాడు. పోనీ
రోజూ కాకపోయినా శనివారం మాత్రం తప్పకుండా
గీసుకుని వస్తున్నాడు. నేను మిగతా కస్టమర్లను
ఎటెండ్ అవుతుంటే నాకోసం కాచుకుంటాడు.
శాంపుల్ బిళ్లలు తిరగేస్తూ, షెల్ఫ్‌లో డబ్బాలమీద
పేర్లు చదువుతూ కాలక్షేపం చేస్తూంటాడు.

సుబ్బరత్నంగారు మహాకుళ్లుబోతు. "ఏం కా
వాలో చెప్పండి?" అని సతాయిస్తూంటుంది. నాకు
అతనిమీద ఇంట్రెస్ట్ ఉన్నట్టు పసిగట్టినట్టుంది.

మొన్నోసారి "అతనికి రేట్లు తక్కువగా వేస్తున్న
ట్టున్నావు!" అంది.





# డాక్టర్ - డాక్టర్

డైట్ థెరపీ, మాగ్నటో థెరపీ, యోగా థెరపీ, ఆక్యుపంచర్‌లలాంటి ప్రకృతి సంబంధ వైద్య విధానాలకు సంబంధించిన సమస్యలు, సందేహాలకు ప్రముఖ ప్రకృతివైద్యనిపుణులు

డా॥ జి.గణేష్ బి.ఎన్.వై.ఎస్., ఎం.డి. జవాబులివ్వనున్నారు.

**మీ ప్రశ్నలు** డాక్టర్-డాక్టర్, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, ఎక్స్‌ప్రెస్ సెంటర్, దోమల్ గూడ, హైదరాబాద్-29.

"రెగ్యులర్ కస్టమర్ కదా! వాళ్లింటి దగ్గరే నాలుగు షాపులున్నాయట. మనం రీజనబుల్‌గా ఇస్తామని మనదగ్గరకే వస్తున్నాడు" అన్నాను.

"అదేం కాదు, వాళ్ల ఫాక్టరీకి మనషాపు దగ్గర. వెళ్లేదారే కదా అని వస్తాడు. రేటు నచ్చకపోతే మానేస్తాడు. బిజినెస్ పోతే నష్టపోయేది షావుకారుగారు. తక్కువ రేట్లేస్తే నీ దగ్గర వసూలుచేయాల్సి ఉంటుంది!"

"మీ ఇష్టంవచ్చినట్టు చేయండి!" అని సంభాషణ తుంచేశాను. రేటు ఎక్కువని అతను రావడం మానేస్తే నష్టం షావుకారు ఒక్కడికే కాదు.

అతను నాకోసమే వెయిట్ చేస్తాడన్నది నాకు మహా సంతృప్తికలిగించే విషయం. నేను ఇస్తున్న ప్రోత్సాహంతో సోఫా పెయింటింగ్ అయిపోయాక కిటికీలకు, ఆపైన వాషింగ్‌మెషిన్‌కు, డోర్‌కు, బియ్యండ్రమ్ముకు అన్నిటికీ వేసేస్తున్నాడు. నాబోటి ఆడది వెంటనుంటే మగాడు కొండల్ని పిండి కొట్టడూ! మగాడిలో ఎంతో శక్తి ఉంటుంది. అతన్ని కదిలించి, విశ్వాసం కలిగించి, ఉత్సాహం రగిలించి, ప్రేరేపించగలిగేది ఆడది మాత్రమే. ఇవన్నీ చేస్తూ కూడా తను ఏమీ తెలియని ముగ్ధలా ఉండాలి స్త్రీ. క్రితం శనివారం అతను అడిగిన పెయింటు డబ్బా లోపల రాక్స్‌లో ఉంది. షాపులో కుర్రాడు లేడు. తనకు అందదు. అతన్నే లోపలికి రమ్మనమంది.

తను మునివేళ్లమీద నిలబడి పై షెల్ఫ్‌లోంచి డబ్బా తీయబోయాడు. బుచ్చిబాబుగా, ... పైన ఉన్న డబ్బాలు తీసి పక్కన పెట్టకుండానే కిందది లాగాడు. అది పడబోతే పట్టుకోబోయి తూలాడు. డబ్బాకింద పడేయలేదు కానీ తనమీద పడ్డాడు. రాక్‌కీ, అతనికీ మధ్య తను నలిగిపోయింది. బుచ్చిబాబు సిగ్గుపడిపోయాడు. బెదిరిపోయాడు. క్షమాపణలు చెప్పడం మొదలెట్టాడు.

"సరేలెండి, బయటకు పదండి, మిగతా కస్టమర్లు వస్తారు!" అంది తను.

"నిజంగా చాలాసారీఅండీ! కావాలని చేయలేదు. పాపం మిమ్మల్ని బాగా ఒత్తేశాను!" అంటున్నాడు అతి సిన్సియర్‌గా.

తను ఇక ఉండబట్టలేకపోయింది. కాసేపు ఆగితే ఏ వెంకట్రామయ్యగారో లంచ్‌కని లోపలికి వచ్చేస్తారు. గబగబా - "నేనేం కష్టపెట్టుకోలేదు. మీకు కష్టంగా ఉందంటే చెప్పండి, మిమ్మల్నీ రాక్‌కేసి నలిపేసి బదులు తీర్చేస్తాను!" అని అంటూనే బయటకు వచ్చేశాను.

సామాన్లు తీసుకుని వెళ్లిపోతుంటే అతనికి నా మాటల్లో కొంటెతనం అర్థమయినట్టుంది వెనిక్కి వచ్చి, ఓసారి హాయిగా నవ్వేసి వెళ్లిపోయాడు.

ఆ నవ్వు సుబ్బరత్నం కళ్లపడకుండా ఉంటుందా? కస్టమర్లను లోపలికి పిలుచుకెళ్లడమేమిటంటూ నిలదీసింది. "కుర్రాణ్ని ట్రాన్స్‌పోర్టు ఆఫీసుకు పంపించారు. నాకు అందదు. నిచ్చెన వేసి ఎక్కడం నాకు సిగ్గు. అందుకనీ ..." అని చెప్పబోయాను.

"సిగ్గు ..!" అంటూ వెటకారంగా నవ్విందా శూర్పణఖ. చూసివుండదులే. అయినా ఏడుపుగొట్టు మనిషికదా! అతని పాతబిల్లులన్నీ పైకి లాగి నేను ఇచ్చిన డిస్కౌంట్లన్నీ నేనే కట్టాలంది. షావుకారుగారికి ఈవిడ మాట వేదవాక్కు. ఆయనతో చెప్పి ప్రయోజనం లేదు. మొత్తం యాభైరూపాయలు. కట్టేశాను. ఈ నెలంతా ఇంటికి నడిచి వెళ్లాల్సిందే. అనుకోకుండా దక్కిన అతని కౌగిలిబిగి గుర్తుకొస్తే చాలు కాళ్లనొప్పి ఎగిరిపోయేది. రావిశాస్త్రిగారి కథ ఏదో ఉండాలి. ఓ కుర్రాడు అనుకోకుండా ఓ ఆంగ్లోఇండియన్ అమ్మాయికి పరిచయమవుతాడు. ఆ ఉత్సాహంతో ఇంటిదగ్గర మామకూతురితో సరసమాడతాడు. ఇక్కడ రెండు పాత్రలూ తనే పోషిస్తోందన్నమాట.

కానీ అది జరిగిన తర్వాతి శనివారం అతను రాలేదు.

సుబ్బరత్నం మహాహుషారుగా ఉంది. "ఏమిటి విజయా, చాలా డల్‌గా ఉన్నావు?" అంటూ జోకులు. ఆవిడ జోకులువేయడం ఇదే ప్రథమం. ఇదే ఆఖరుకూడా కావాలి. పై శనివారం అతను తప్పకుండా రావాలి. వచ్చి అతను హోటల్‌కి రమ్మని ఈవిడ ఎదురుగానే పిలవాలి. అప్పుడు చూడాలి ఆవిడ ముఖం. రూమ్‌కి తీసుకెళ్లి, "ఇదిగో, నువ్వు ఐడియా చెప్పిన ప్రకారమే చేశా, చూడు!" అని ఇంట్లో ఫర్నిచరంతా చూపించాలి. వద్దు, వద్దు. అప్పుడే రూముకి వద్దు. ఒంటరిగా ఉంటున్నాడు. అక్కడికివెళితే తననుతానే నిగ్రహించుకోలేకపోతే, బుచ్చిబాబుకి కూడా తనను చూసి పిచ్చిఎక్కితే ... అమ్మో ... మహా డేంజర్! పెళ్లయిన తర్వాతే అవన్నీ. ఈ శనివారం వచ్చి తీరాలి దేవా, నన్నుకాపాడు. లేకపోతే ఈ సుబ్బరత్నం చూపుల్ని భరించలేను. ఉద్యోగం మానేస్తానంతే!

దేవుడు నా ప్రార్థన విన్నాడు. అతను వచ్చాడు. చేతిలోపూలు కూడా ఉన్నాయి. తెచ్చి, "హేపీ బర్త్ డే!" అన్నాడు.

నాకు మతిపోయింది. "నా పుట్టినరోజని మీకెవరు చెప్పారు?" అన్నాను.

"క్రితంనెల నేడున్నప్పుడే మీకు ఓ ఫ్రెండ్ నుంచి ఫోన్‌వచ్చిందిగా, మీరుమాటల్లో మీ పుట్టిన రోజు ఫలానా తేదీన అని చెప్పగా విన్నాను. గుర్తుపెట్టుకున్నాను. ఏమీ అనుకోకపోతే తీసుకోండి!" అన్నాడు.

ఖర్మ, సుబ్బరత్నం దగ్గర్లో లేదు. మొహం మాడిపోయి ఉండేది. "నేనంటే ఎందుకండీ ఇంత ఇది?" అన్నాను పూలుతీసుకుంటూ. ఆ 'ఇది' ఏమిటో అతను చెప్పాలికానీ, నేను అనకూడదు.

"భలేవారే! మా సుశీల నన్ను మెచ్చుకుందంటే మీరేగా కారణం. అసలు నేనెందుకూ పనికిరానిచవటననీ, నాకేమీ టేస్టులేదనీ తనకు బాగా నమ్మకం. మీరిచ్చిన ప్రోత్సాహంతో ఇంట్లో అన్నిటికీ పెయింట్ వేసేశాగా! తను ముగ్దురాలైపోయింది. నన్ను చూసి మురిసిపోయింది. అసలింత బాగా ..."

"సుశీల ఎవరు?" అని నాలుకతడి ఆరిపోతూండగా.

"ఓసారి చెప్పానుగా, నా ఫియాన్సీ అని. తాంబూలాలు ఇంకా పుచ్చుకోలేదనుకోండి ..."

చెప్పలేదురా బుచ్చిబాబూ అనాలనిపించింది. అన్నా తను వినిపించు కునేట్టు లేదు. తన సుశీల గురించి ఏదో చెప్పుకుపోతున్నాడు. సుబ్బరత్నం లోపల్నుంచి వచ్చి మాటలు వింటోంది. వీపు తిప్పకుండానే ఆమె వంకరనవ్వు నాకు కనబడుతోంది. నల్లపెయింట్ పట్టుకొచ్చి ఇతనికి పూసేయాలనిపిస్తోంది. ఉప్పు కాగితం పెట్టి మొహం అంతా రుద్దేద్దామనిపిస్తోంది. ఓ ఆడపిల్లను ఊరించిన పాపం ఊరికే పోతుందా? ఆ సుశీల వీణ్ని వదిలేసి పోతుందిలే. సుశీల, దుశ్శీల ... పేరే బాగోలేదు. ఇతని పేరేమిటో. ఏమయితేనేంలే. పూలగుత్తి పక్కన పడేసి ఓ వెర్రినవ్వు నవ్వాను అతనికేసి చూసి.

అంత హుషారుగా మాట్లాడుతున్నవాడూ నేనలా నిస్సారంగా కనబడగానే సడన్‌గా బుచ్చిబాబు అయిపోయాడు. "వస్తానండీ!" అంటూ వెళ్లిపోయాడు.

నాకు ఏడుపొస్తోంది. తన్నుకువస్తోంది.

వెళ్తూవెళ్తూ గుమ్మం దగ్గిర ఆగాడు. ఏదో గుర్తువచ్చినట్టు వెనుదిరిగాడు. "ఏమండీ!" అంటూ నా దగ్గరకి వస్తున్నాడు.

ఎందుకంటారు? ఇంకా పెయింట్ కొనాలనా? ఒకవేళ సుశీల అతనికి నచ్చలేదేమో, కుటుంబంలో పెద్దల ఒత్తిడికి తలవొగ్గి ఒప్పుకున్నాడేమో. నన్ను చూశాక ఉద్దేశ్యం మార్చుకున్నాడేమో. నన్ను హోటల్‌కి కాఫీకి రమ్మని పిలిచి, 'మీరు ఔనంటే సుశీల సంబంధం వద్దని మా వాళ్లకి రాసేస్తా, ఏమంటారు?' అని అంటాడేమో. లేకపోతే వెనక్కి ఎందుకు రావాలి చెప్పండి.

ఇలా ఊహించడం, కలలు కనడం పొరబాటంటారా? ఎంతైనా ఆడపిల్లని కదా ...

## గమనిక

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణకై పంపే రచనలు, కార్టూన్లు, ఫోటోలు తిరుగు పోస్టేజీ జత చేయకుండా, తరువాత కొంతకాలానికి పంపి, ఎంపిక కానివి తిప్పిపంపమని కొందరు కోరుతున్నారు. ఈవిధమైన రచనలు తిప్పి పంపడం సాధ్యం కాదని మనవి. ప్రచురణకై పంపేవి అన్నీ కూడా తిరుగు పోస్టేజీ జత చేసి పంపాలి. పోస్టేజీ జత చేయనిపక్షంలో ప్రచురణ యోగ్యతలేనివి తిప్పి పంపే బాధ్యత వహించడం వీలుపడదు.

-ఎడిటర్


సింగిల్ బెడ్ రూం ఫ్లాట్ రూ. 81,000/- లు ❖ డబుల్ బెడ్ రూం ఫ్లాట్ రూ. 1 లక్షకే

**నమ్మకతకు నాణ్యతకు మరో పేరు - జనప్రియ నిర్మాణాల తీరు**

ఒక పుష్కరం నుండి, మధ్య తరగతి వారికి ఆశ్రయమే ఆశయంగా, జంటనగరాలలో వివిధ ప్రాంతాల్లో దాదాపు 6000 ఫ్లాట్లు నిర్మించి, మరో 4000 ఫ్లాట్లు నిర్మాణానికి పునాది వేస్తూ, మధ్య తరగతి వారిని సొంత ఇంటి వారిని చేస్తూ, గృహనిర్మాణ రంగంలో నాణ్యతకు, నమ్మికకు ప్రతీకగా నిలచి, మేనేజ్‌మెంట్, ప్లానింగ్, డిజైనింగ్, ఎక్సిక్యూషన్, మార్కెటింగు విభాగాలన్ని ప్రతిభావంతులైన ఇంజనీర్లచే నిర్వహింప బడుతూ, సొంత సిమెంట్, బ్రిక్స్, ఫ్లోరింగ్ టైల్స్, బిల్డింగ్ మెటీరిల్స్ కలగి వున్న ఏకైక సంస్థ జనప్రియ ఇంజనీర్స్ సిండికేటు, నేడు, ప్రవేటు, ప్రభుత్వ ఉద్యోగస్థులకే కాక, వ్యాపారస్థులకు, చిన్న పరిశ్రమలలో పని చేయు ఉద్యోగస్థులకు, వ్యవసాయదారులకు సైతం గృహవసతి కల్పించు **OWN YOUR HOUSE (OYH)** స్కీమును ప్రప్రథమంగా ప్రవేశ పెట్టి, స్వాతంత్ర్య స్వర్ణోత్సవ సంవత్సరాన, అందిస్తున్న అపూర్వ సువర్ణకానుక

# జనప్రియ మహానగర్

డి.ఆర్.డి.యల్. మిధానికి దగ్గర, 'కోటి' కి కేవలము 12 కి.మీ. **3600 FLATS**

*For Demand Survey*



**HIGHLIGHTS**

- Free from pollution.
- All flats are as per Vaastu
- Surounded by well laid, wide Tar Roads
- Frequent city buses from Koti (12C, 102M, 102R & 103)
- All flats are well ventilated & ducts free
- Project is located nearer to well developed Townshipslike DRDO & Midhani

**COMMON FACILITIES**

● A Multipurpose Shopping Complex ● Provision for School & Hospital ● Space for Community Hall, Gym & Indoor Games ● Recreational facilities like Ladies & Gents Clubs ● Cable T.V. by Maha Vision ● A well developed play ground for children ● A Telephone Club for those who don't possess own telephones

**MAHANAGAR BRANCH OFFICE**
# 113, Vinay Nagar Shopping Complex,
Santhosh Nagar 'X' Road. ✆ : 4534585

**CONTACT AT CORPORATE OFFICE**
N. Nandanandan Reddy B.Tech (Civil)
General Manager, ✆ : 3222666 3222999

ఈ రేట్లు ఉగాది వరకే పరిమితం



K. RAVINDER REDDY
B.Tech (Civil), MIE, MIGS
Chairman & Managing Director

CITIZEN ADS

*Engineers who know housing better*

**ENGINEERS SYNDICATE (INDIA) PVT.LTD.**

(Promoted by Janapriya Engineers Syndicate)

**Corporate Office** : Janapriya House 3-6-115/A, **Himayathnagar**, Hyd.-29. ✆ : 3222999 3222666, 3220209, 230202, Fax: 040-3227515

**Administrative Office** : # 258 13th Cross Wilson Garden Bangalore ✆ : 2271381 Fax : 080 2206131

**Branch Offices** : Janapriya Quarters Manan Nagar ✆ : 4040448 Janapriya Township Nacharam ✆ : 7154141 Janapriya Apartments Miyapur ✆ : 3045544

**TEAM OF ENGINEERS - DREAM OF MASSES**